ఇంకుతున్న జలం.. జంకుతున్న జనం..

రెండేళ్లకు పైబడి సరైన వర్షాలు సరిగ్గా పడక పోవడంతో భూగర్భజలాలు అడుగంటి రైతులతో పాటు ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పెద్దఎత్తున సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. అరటి రైతులకు పెద్దఎత్తున నష్టం వాటిల్లే పరిస్థితులు ఉన్నాయి. 2021 నవంబరులో కురిసిన కుంభవృష్టితో అన్నమయ్య ప్రాజెక్టుతో పాటు అనేక చెరువులు, కుంటలు తెగిపోయాయి. అనంతరం పూర్తి స్థాయిలో వర్షాలు పడలేదు. గత ఏడాది డిసెంబరులో కొద్దిపాటి వర్షం కురిసిందే తప్ప ఎక్కడా సగటు వర్షపాతం నమోదు కాలేదు. దీంతో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో పూర్తిగా భూగర్భజలాలు అడుగంటి కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి.

- వర్షాలు పడకపోవడంతో ఇంకిపోతున్న భూగర్భజలాలు
- తాగునీటికీ తప్పని తిప్పలు
- ఎండుతున్న పంట పొలాలు
- ఇదే పరిస్థితి కొనసాగితే భారీ ఎత్తున నష్టపోనున్న రైతులు



భూగర్భజలాలు అడుగంటడంతో మిట్టమీదపల్లెలో ఎండిపోతున్న అరటిపంట

రాజంపేట, మార్చి 3: రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో వందకు పైబడి చెరువులు ఉన్నాయి. చెయ్యేరు, గుంజనేరు, పుల్లంగేరు, పెన్నా తదితర నదులు ప్రవహిస్తున్నాయి. స్థానికంగా వర్షాలు కురవకపోవడం, ఎగువ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉండటంతో పెద్ద ఎత్తున కరవు పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రధానంగా బోరుబావుల్లో కూడా నీరు అడుగంటుతుండటంతో ఇప్పటికే సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్నాయి. మరో రెండు నెలల్లో ఇదే పరిస్థితి కొనసాగితే ప్రధానమైన పంటలన్నీ నిలువునా ఎండిపోనున్నాయి. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏడాదికి 720 సెంటీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా అటువంటిది రెండేళ్లుగా పరిశీలిస్తే 400 సెంటీమీటర్ల వర్షపాతం కూడా కురవలేదు. కరువు పరిస్థితులను గమనించి రైతులు భారీ ఎత్తున పంట పొలాల్లో ఏ పంటలు వేయక వదిలివేయడంతో అవి బీడు భూములుగా మారిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలకు కూడా తాగునీటి తిప్పలు తప్పేటట్లు లేవు. ఇప్పటికే అనేక రక్షిత మంచినీటి పథకాల్లో భూగర్భజలాలు అడుగంటి అలంకారప్రాయంగా మారాయి. మరో రెండు నెలల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు కలగనున్నాయి. ఈ ప్రాంతంలో ప్రధానంగా అరటి, బొప్పాయి, వరి, మామిడి పంటలను విరివిగా సాగు చేస్తారు. బాగా పండితే అన్ని ఖర్చులు పోనూ ఒక ఎకరాకు రెండు లక్షల వరకు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం అరటి, బొప్పాయి పంటలు విస్తారంగా సాగయ్యాయి. మామిడి సీజన్ కూడా ప్రారంభమైంది. పూతదశ నుంచి పిందె దశలోకి మామిడి కాయలు వస్తున్నాయి. ఈ మామిడి చెట్లకు, ఇతర అరటి, బొప్పాయి చెట్లకు పుష్కలంగా నీరు అవసరముంది. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటడంతో ఈ పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది.

అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో ఆయకట్టు ప్రాంతాలు ఎడారిని తలపిస్తున్నాయి. ప్రాజెక్టు తెగిపోవడం వల్ల ఆ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న 22,500 ఎకరాలు పూర్తిగా చుక్కనీరు లేక బీడుగా మారాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పుల్లంపేట, రాజంపేట ఎగువ ప్రాంతాలన్నీ ప్రాజెక్టు నీరు లేకపోవడంతో పాటు మొత్తం సాగు నిలిచిపోయింది. అదే పరిస్థితుల్లో కరవు వల్ల రాజంపేట మండలంలోని మిట్టమీదపల్లె, కొల్లావారిపల్లె, బావికాడపల్లె, కూచివారిపల్లె, బ్రాహ్మణపల్లె చుట్టుపక్కల గ్రామాలు, పెనగలూరు మండలంలోని చక్రంపేట, పొందలూరు, బెస్తపల్లె, నల్లపురెడ్డిపేట, గుడ్లావారిపల్లె చుట్టుపక్కల గ్రామాలు, చిట్వేలి మండలంలోని నగిరిపాడు, నాగవరం, మైలపల్లె, చుట్టుపక్కల గ్రామాలు ఈ విధంగా చెప్పుకుంటూ వందలాది గ్రామాల పరిస్థితి ఆ గమ్యగోచరంగా తయారయ్యే పరిస్థితి ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రధానమైన పంటలన్నీ పాడయ్యే పరిస్థితి ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నందలూరు మండలం పొత్తపి, మిట్టమీదపల్లె, కొల్లావారిపల్లె, బావికాడపల్లె, కూచివారిపల్లెల్లో తాగునీటి సమస్య కూడా మొదలైంది. దానికి తోడూ కరెంటు కోతలు కూడా తోడుకావడం గోరుచుట్టపై రోకలిపోటు అన్నట్లుగా రైతుల పరిస్థితి తయారైంది.

రైల్వేకోడూరులో గుంజనేరు ప్రధానమైన సాగునీటి వనరు. తిరుమల గిరుల నుంచి ప్రవహించే ఈ గుంజనేరు ఆధారంగా కోడూరు, చిట్వేలి, పెనగలూరు మండలాల్లోని సుమారు 90 శాతం గ్రామాలన్నీ ఈ గుంజనేరు ఆధారంగానే పంటలను సాగు చేస్తారు. ఈ గుంజనేరుకు ఆనకట్టలు కట్టి తద్వారా భూగర్భజలాలను నిల్వ చేస్తారు. ఆ ఆనకట్టల ద్వారా తరతరాలుగా బ్రిటీషు కాలం నుంచి చెరువులకు నీళ్లు మళ్లిస్తారు. అంటే ఈ నది ఆధారంగా అటు చెరువులకు, ఇటు భూగర్భజలాల పెంపునకు ఈ నీటిని వినియోగిస్తారు. అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ఉంటుంది. అటువంటిది గుంజనేరు పరిస్థితి రానురాను దయనీయంగా తయారైంది. కారణం గుంజనేరు ఆనకట్టలు తెగిపోయి ఉండటం, బ్రిటీషు కాలంలో ఉన్న ఆనకట్టలు తప్ప కొత్తగా ఆనకట్టలు ఏర్పాటు చేయకపోవడం, ప్రధానంగా వర్షపాతం తగ్గడం, వరదనీరు రాకపోవడం ఇత్యాది కారణాల వల్ల ఈ గుంజనేరు పరిస్థితి దారుణంగా తయారై ఆ నదికి ఇరువైపులా ఉన్న గ్రామాలలో తాగునీరు, సాగునీరు సమస్య ఏర్పడింది. పుల్లంపేట, ఓబులవారిపల్లె ప్రాంతాల్లో ప్రధానంగా పాములేరు, పుల్లంగేరు ఓ చిన్నపాటి నదులుగా ఉంటూ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామల చేస్తున్నాయి. తిరుమలగిరుల నుంచి ప్రవహించే ఈ నీటి వల్ల ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాలు సస్యశ్యామలమవుతాయి. గుంజనేరులా ఈ నది పరిస్థితి తయారవ్వడంతో ఇక్కడి చెరువులకు చుక్కనీరు వచ్చే పరిస్థితి లేదు. జిల్లాలో అతి పెద్ద చెరువు అయిన పెద్ద ఓరంపాడు, రెడ్డిపల్లె చెరువులు కూడా అలంకారప్రాయంగా మారాయి. ఇక పెనగలూరు మండలం అటు గుంజనేరుతోనూ, ఇటు చెయ్యేరుతోనూ సస్యశ్యామలంగా ఉంటుంది. చెయ్యేరు ద్వారా గతంలో ఊట కాలువలను ఏర్పాటు చేసుకుని ఆ ఊటకాలువల ద్వారా పంటలను సాగు చేసుకునేవారు. నాలుగు అడుగుల లోతులోనే చెయ్యేరులో గతంలో నీరు లభించేది.

ఎగువ ప్రాంతంలో అన్నమయ్య ప్రాజెక్టు ఉండటం, ప్రాజెక్టు ప్రాంతంలో నదికి అడ్డంగా 120 అడుగుల లోతు కాంక్రీటువాల్ భూగర్భంలో ఏర్పాటు చేయడం వల్ల నదిలో వచ్చే భూగర్భజలాలు దిగువ ప్రాంతాలకు చుక్కనీరు వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం ప్రాజెక్టు తెగిపోవడం వల్ల వచ్చిన కొద్దిపాటి వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు వచ్చినందున కొంత మేలు జరిగింది. అయితే ఊట కాలువలను తిరిగి వాటిని పునరుద్ధరించకపోవడం వల్ల అందుకు సంబంధించిన ఆయకట్టు ప్రాంతం కూడా బీడుగా మారింది. రాజంపేట నియోజకవర్గంలో ప్రధానంగా పెన్నా, చెయ్యేరు నదులు ప్రధానమైనవి. పెన్నానది పరీవాహక ప్రాంతం సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలు సస్యశ్యామలవుతాయి. జీవనదిలా ప్రవహించే పెన్నానది వల్ల సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో నీటి సమస్య ప్రస్తుతానికి లేదు. ఇక సుండుపల్లెలో ప్రవహించే బాహుదా, వీరబల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రవహించే మాండవ్య నదుల వల్ల కొంత ప్రయోజనం ఉన్నా వర్షాలు లేకపోవడం వల్ల అక్కడ కూడా తాగునీటి సమస్య ఏర్పడింది.

పంటలు సాగు చేయడం మానుకున్నాం..



రాజంపేట మండలం మిట్టమీదపల్లె, కొల్లావారిపల్లె ప్రాంతాలలోని సుమారు 20 గ్రామాల్లో పంటలు సాగు చేయడం మానుకున్నాం. 20 ఏళ్లగా అన్నమయ్య ప్రాజెక్టు నీటితో మా పంటలు పండేవి. బోరుబావుల్లో పుష్కలంగా భూగర్భజలం ఉండేది. ఇప్పుడు ప్రాజెక్టు లేకపోవడం, భూగర్భజలం ఇంకడం వల్ల పంటలు సాగు చేయడం మానుకున్నాం. మామూలుగా ప్రధానంగా అరటి, బొప్పాయి పంటలను మా గ్రామాల్లో విరివిగా సాగు చేసేవాళ్లం. ఇప్పుడు ఏమీ చేయలేని పరిస్థితిలో సాగు భూములన్నీ బీడుగా ఉంచుకున్నాం. సుమారు 5 వేల ఎకరాల్లో పంటలు సాగు లేకుండా ఖాళీగా ఉన్నాయి.

- గుడారు సుబ్రమణ్యంనాయుడు, రైతు, మిట్టమీదపల్లె, రాజంపేట

వర్షాలు పడకపోతే రైతుల పరిస్థితి అధోగతే..



మరో ఆరు నెలల పాటు వర్షాలు కురవకపోతే రైతుల పరిస్థితి అథోగతి కానుంది. ఇప్పటికే భూగర్భజలాలు రాజంపేట డివిజన్‌లో అడుగింటాయి. ఈ ఆరు నెలలు భూగర్భజలాలు పెద్దఎత్తున తగ్గిపోనున్నాయి. గత రెండు సంవత్సరాలుగా వర్షాలు లేకపోవడం వల్ల ఈ ప్రాంతం కరవు ప్రాంతంగా ఏర్పడనుంది. ప్రధానంగా అన్నమయ్య ప్రాజెక్టు ఉండి ఉంటే ఈ ప్రాంతంలో భూగర్భజలాలు పుష్కలంగా ఉండి సాగునీటికి, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేది. ఆ ప్రాజెక్టు తెగిపోవడం వల్ల చుక్కనీరు లేక భూగర్భజలాలన్నీ అడుగంటాయి. తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

- అంజన్‌రాజు, తాళ్లపాక, రాజంపేట మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి..



రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో తీవ్రంగా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. రైతులకు ఏదో పెద్దగా మేలు చేస్తామన్న జగన్ ప్రభుత్వం ప్రధానంగా కరువు బారిన పడనున్న రైతులను ఆదుకోవడంలో తీవ్రంగా విఫలమైంది. ఒకప్పుడు కోనసీమగా పిలువబడే రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు నేడు కరువు పరిస్థితుల్లో చిక్కుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వారికి ప్రత్యేక ప్యాకేజీ కింద ఆర్థికసాయం చేసి ఆదుకోవాల్సి ఉంది.

- నాగమునిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి, సిద్దవటం



టి.కమ్మపల్లెలో ఎండిపోతున్న అరటి తోటను చూపుతున్న రైతు రామచంద్రనాయుడు



మిట్టమీదపల్లెలో సాగుకు నోచుకోక బీడుగా ఉన్న పంట పొలాలు



సాగుకు నోచుకోని రాజంపేట మండలం పోలి గ్రామ పరిధిలోని మిట్ట ప్రాంతం



వాహనంలో నుంచి బ్యాగులను దింపుతున్న వైసీపీ శ్రేణులు

ఓటర్ల ప్రలోభాలకు తెర

రైల్వేకోడూరు మండలంలో చీరలు పంపిణీ చేసిన వైసీపీ నేతలు

రైల్వేకోడూరు, మార్చి 3: ఎన్నికల నోటిఫికేషన్ రాక మునుపు అయితే ఎవరూ అడ్డు చెప్పరని ప్రజల్ని పావులుగా చేసుకుని ఓట్లు దండుకుంటామని వైసీపీ ప్రభుత్వం కొత్త పన్నాగం వేసింది. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని ప్రజలను ఎలాగైనా ప్రలోభాలకు గురి చేయాలని ఆదివారం రైల్వేకోడూరు మండలంలోని తిమ్మిశెట్టిపల్లె పంచాయతీ కేంద్రంలో బహిరంగంగా అధికార వైసీపీ నాయకులు వలంటీర్ల సాయంతో రేషన్ కార్డు ఉన్న ప్రతి ఇంటికి చీరతో కలిగిన బ్యాగును పంపిణీ చేశారు. బ్యాగుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఫొటోలు ముద్రించి ఉన్నాయి. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేద్దాం అని బ్యాగుపై రాసి ఉంది. ఎన్నికల సమయంలో అయితే పంపిణీ చేయలేమనే ఆలోచనతో ఎన్నికల నోటిఫికేషన్ రాకమునుపు అయితే సులభంగా ప్రజల్ని ఆకట్టుకోవచ్చునని వైసీపీ ఒక పథకం ప్రకారం ప్రజలను మళ్లీ మోసం చే సేందుకు తెరలేపిందని రైల్వేకోడూరు జనసేన నాయకుడు గంధంశెట్టి దినకర్‌బాబు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి చీర, స్వీట్లు తదితరాలను ఇచ్చారని విమర్శించారు. ప్రజల్లో నిజమైన విశ్వాసం ఉంటే ఇలాం టి పనులు చేయరని, నేరుగా ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుక్కోవాలని తెలిపారు. వైసీపీ చేస్తున్న ఇలాంటి ప్రలోభాలను ప్రజలే అడ్డుకుని ఇప్పుడే చెక్ పెట్టాలని కోరారు. దీనిపై ఎన్నికల ప్రత్యేక అధికారి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రత్యేక వాహనాల్లో పెద్ద, పెద్ద సం చుల్లో చీర బ్యాగులు తీసుకుని వచ్చారన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు, గ్రామాలకు చీర బ్యాగులను తరలించారని తె లిపారు. వీటిని జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకోవాలన్నారు. అధికారులు నిఘా ఏర్పాటు చేసి పట్టుకుని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించారు.



రైల్వేకోడూరు మండలంలోని తిమ్మిశెట్టిపల్లెలో వైసీపీ నాయకులు పంపిణీ చేసిన బ్యాగు, చీర

రెండు చుక్కలతో నిండు నూరేళ్లు రక్ష

- చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించండి
- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి టౌన్, మార్చి 3: చిన్నారులందరికీ రెండు పోలియో చుక్కలు వేయించండి, చిన్నారి బంగారు భవిష్యత్తుకు నిండు నూరేళ్ల రక్ష ఇవ్వండని పోలియో రహిత సమాజానికి కృషి చేద్దాం కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పిలుపునిచ్చారు. జిల్లాలో నేటి నుంచి మార్చి 5వ తేదీ వరకు జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం హార్సిలీహిల్స్‌లోని ఎమర్జెన్సీ మెడికల్ కేంద్రంలో పిల్లలకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 5వ తే దీ వరకు చేపట్టే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,93,946 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ కృషి చేస్తుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పోలియో నిర్మూలన వందశాతం సాధ్యమవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యల ద్వారా దేశ వ్యాప్తంగానే కాకుండా జిల్లాలో కూడా పోలియోను పూర్తి స్థాయిలో నిర్మూలించగలిగామన్నారు. పోలియో వైరస్ మన చుట్టూ లేకపోయినప్పటికీ పక్క దేశాలైన పాకిస్థాన్, ఆఫ్గనిస్థాన్ దేశాల్లో కొంత వరకు పోలియో ప్రభావం ఉండటం వల్ల ముందస్తుగా ప్రతి ఒక్క బిడ్డను పోలియో నుంచి రక్షించుకోవడం మన బాధ్యత అన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా విజయవంతం చేయాలన్నారు.



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

హార్సిలీహిల్స్‌లోని ప్రభుత్వ ఆస్తులపై కలెక్టర్ ఆరా

బి.కొత్తకోట, మార్చి 3: ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పర్యటించారు. శనివారం రాత్రి పొద్దుపోయాక కుటుంబసమేతంగా హిల్స్‌కు చేరుకున్న కలెక్టర్ ఆదివారం అక్కడే గడిపారు. కుటుంబంతో కలిసి గవర్నర్ బంగ్లాలో విడిది చేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ ప్రాంగణంలో జరుగుతున్న వసతిగృహ పనులను పరిశీలించారు. ఇటీవలే సుందరీకరణ పనులు పూర్తి చేసుకున్న రెవెన్యూ అతిథి గృహాన్ని చూశారు. గాలిబండ, కొత్త వ్యూపాయింట్‌లను సందర్శించారు. మదనపల్లె ఆర్డీవో మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌లో పర్యాటక రంగం అభివృద్ధికి నూతన ప్రణాళికలు సిద్ధం చేయాలని, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు పంపాలని టూరిజం మేనేజర్ సాల్విన్‌రెడ్డిని ఆదేశించారు. కొండపై ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రంలో కలెక్టర్ సతీమణితో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం హార్సిలీహిల్స్‌లోని ప్రభుత్వ ఆస్తులు, అటవీ, శాప్, పోలీస్, టూరిజం, రైల్వే తదితర శాఖలకు కేటాయించిన భూములకు సంబంధించిన మ్యాప్‌లు, రెవెన్యూ రికార్డులను సమర్పించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో బి.కొత్తకోట మండల డిప్యూటీ తహశీల్దార్ అన్సారీ, సర్వేయర్ శ్రీవాణి, వీఆర్వో నరేంద్రకుమార్ సంబంధిత దస్తావేజులతో కలెక్టర్ బస చేసిన గవర్నర్ బంగ్లా వద్దే గడిపారు.


అధ్యాపకుడిపై పోక్సో కేసు నమోదు

కురబలకోట, మార్చి 3: మండలంలోని అంగళ్లు సమీపంలోని జూనియర్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకుడిపై ఆదివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బాధితురాలు పోలీసులకు ఇ చ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనప ల్లె పట్టణానికి చెందిన భాస్కర్ అంగళ్లు సమీపంలోని జూనియర్ కళాశాలలో ఏడాదిగా పీఈటీ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. కళాశాల విద్యార్థిని పట్ల అతను అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అంతేకాకుండా పలుమార్లు విద్యార్థినిని బెదిరించి డబ్బులు వసూలు చేయడంతో పాటు రకరకాలుగా బెదిరించాడు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నా ప్రేమ పేరుతో వేధించేవాడు. అతడి వేధింపులు తాళలేక ఆ విద్యార్థిని కుటుంబీకుల దృష్టికి తీసుకెళ్లడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారించి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 3: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 4వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధింత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జిదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రావాలని తెలిపారు.

గుర్రంకొండ బూత్ నెంబరు 19లో పేటా రెడ్డెమ్మ ఓటు



డబుల్ ఎంట్రీల సంగతేంటి..!

- ఒక్కొక్కరికి రెండుచోట్ల ఓట్లు
- తప్పులతడకగా ఓటర్ల జాబితా

గుర్రంకొండ, మార్చి 3: ఓటర్ల జాబితాను ఎన్నిసార్లు సవరించినా తప్పులు మాత్రం అలాగే ఉన్నాయి. ఓటర్ల జాబితాలోని తప్పులను రాజకీయ పార్టీల నాయకులు పలుమార్లు అధికారులకు ఎత్తి చూపినా అవే తప్పులు మాటిమాటికి జరుగుతున్నాయి. ఓటర్ల జాబితా వచ్చిన ప్రతిసారీ నాయకులు తప్పులను అధికారుల దృష్టికీ తీసుకెళ్లడం తప్పులను సరిదిద్దుతామని చెప్పడం సర్వసాధారణమైపోయింది. కొత్త ఓటర్ల జాబితా వచ్చిన ప్రతిసారి నాయకులు తప్పులు లేని ఓటర్ల జాబితా వస్తుందని అనుకోవడం అవే తప్పులు పునరావృతం కావడం పరిపాటిగా మారింది. గుర్రంకొండ మండలం నడిమిఖండ్రిగ పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రం 7 ఓటర్ల జాబితాలో 490 క్రమసంఖ్యలో ఉన్న పేటా విజయ్‌కుమార్‌కు గుర్రంకొండ పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రం 18లోని 755క్రమసంఖ్యలో మరో ఓటు, అలాగే పోలింగ్ కేంద్రం 7లోని 491క్రమసంఖ్యలో ఉన్న పేటా రెడ్డెప్పకు ఇదే పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రం 19లో 221క్రమసంఖ్యలో మరో ఓటు నమోదై ఉంది. అలాగే పోలింగ్ కేంద్రం 8 ఓటర్ల జాబితాలో 77క్రమసంఖ్యలో ఉన్న పేటా రెడ్డెమ్మకు గుర్రంకొండ పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రం 19లో 231క్రమసంఖ్యలో మరో ఓటు, పోలింగ్ కేంద్రం 8లోని 78క్రమసంఖ్యలో ఉన్న పేటా రమేష్‌బాబుకు పోలింగ్ కేంద్రం 18లోని 754క్రమసంఖ్యలో మరో ఓటు ఉంది. ఇవేకాక నడిమిఖండ్రిగ పంచాయతీ పరిధిలోని పలు ఓట్లు వివిధ చోట్ల ఉన్నట్లు గ్రామస్థులు పెదవి విరుస్తున్నారు. ఇలానే గుర్రంకొండ పట్టణంలో కూడా వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది ఓట్లు డబుల్ ఎంట్రీలున్నట్లు తెలుస్తోంది. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


డబుల్ ఎంట్రీలపై విచారణ చేసి సరిచేస్తాం..

గుర్రంకొండ మండలంలోని నడిమిఖండ్రిగ, గుర్రంకొండ గ్రామాల్లో డబుల్ ఎంట్రీలపై మాకు ఫిర్యాదులు వచ్చాయి. ఆయా గ్రామాల బీఎల్వోలకు సమాచారం ఇచ్చి ఓటర్ల జాబితాలో తప్పులను గుర్తించి సరి చేసేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనాథ్, తహసీల్దార్, గుర్రంకొండ



నడిమిఖండ్రిగ బూత్ నెంబరు 7, 8లో ఉన్న పేటా రెడ్డెప్ప, రెడ్డెమ్మ, విజయ్‌కుమార్ ఓట్లు



గుర్రంకొండ బూత్ నెంబరు 18లో విజయ్‌కుమార్, రమేష్‌బాబు ఓట్లు



గాలివీడు: నూలివీడులోని ప్రైమరీ పాఠశాలలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



సుండుపల్లెలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి



చిన్నమండెం: పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ సునీతరెడ్డి

పల్స్‌పోలియో విజయవంతం

సుండుపల్లె, మార్చి3: సుండుపల్లె మండల వ్యాప్తంగా ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్యశాఖ అధికారులు, సిబ్బంది, ఆశవర్కర్లు విజయవతంగా నిర్వహించారు. మండలంలోని రాయవరం, సుండుపల్లె, బీజీరాచపల్లె ప్రాథమిక వైద్య కేంద్రాల పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. మండలంలో 3,477 మంది చిన్నారులుండగా 3458 మందికి ఆదివారం పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. వైద్యాధికారులు వైద్యాధికారులు శేఖర్ రెడ్డి, పర్వాకనమ్, హసన్‌వలి, ఫార్మసిస్ట్ శివకుమార్, నటేశ్, వీరనారాయణ పాల్గొన్నారు.

గాలివీడు: పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైందని డిప్యూటీ డీఎంహెచ్‌వో దేవశిరోమణి తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని పల్స్ పోలియో కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్నపిల్లలకు పోలియో చుక్కలను వేయించాలన్నారు. మండలంలోని గాలివీడు, నూలివీడు సబ్ సెంటర్ల పరిధిలోని 80 పల్స్ పోలియో కేంద్రాల్లోని 5,101 మంది చిన్నారులకు గానూ 5,020 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. నూలివీడు వైద్యులు స్రవంతి, శంకర్‌నాయక్, గాలివీడు వైద్యులు రాధామాధురి, రాఫిక్, సూపర్‌వైజర్ దేవేంద్రరెడ్డి, అనిల్, ఆనంద్, భాస్కర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: వీఆర్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో బస్టాండు కూడలిలో పోలియో కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్లుగా తమ సంస్థ ప్రజల్లో అవగాహన తెస్తోందన్నారు. వీఆర్‌డీఎస్ ట్రెజరర్ బాబు, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, రాయవెకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండలంలో 21 పోలియో కేంద్రాలు, ఒక మొబైల్ కేంద్రంలో 1798 మందికి పోలియో చుక్కలను వేసినట్లు చిన్నమండెం ప్రాథమిక వైద్య అధికారి సునీతారెడ్డి తెలిపారు. మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారాల్లో వేయిస్తామని ఆమె తెలిపారు.

రామాపురం: మండలంలో 4072 మంది చిన్నారులుండగా, 3918 మందికి పోలియో చుక్కలు వేసినట్లు మండల ప్రాథమిక వైద్యాధికారి వినోద్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని ప్రాథమిక, ఉన్నత, అంగన్వాడీ, జిల్లా పరిషత్ పాఠశాల, రామాపురం బస్టాండులో పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

పెనగలూరు: మండల వ్యాప్తంగా 4575 మంది చిన్నారులుండగా, 4484 మందికి 45 కేంద్రాలు ఒక మొబైల్ కేంద్రంలో పోలియో చుక్కలు వేసినట్ల సీహెచ్‌వో సురేంద్రనాథ్ తెలిపారు. మొబైల్ టీంలో డాక్టర్ జోసఫ్, పీహెచ్ ఎన్ లక్ష్మీ నరసమ్మ, సూపర్ వైజర్ చెన్నమ్మ పాల్గొన్నారు.

సంబేపల్లె: మండలంలో 97 శాతం పల్స్ పోలియో వేసినట్లు వైద్యాధికారులు సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సునీల్‌నాయక్, శ్రీధర్ తెలిపారు. సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 2171 మంది పిల్లలకు గానూ 2127 మందికి. దేవపట్ల పరిధిలో 1923 మందికి గానూ 1825 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మండలంలో ఆరు రూట్లు, 51 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

రైల్వేకోడూరు: మండలంలోని సచివాలయాలు, పంచాయతీ కేంద్రాలు, ఆర్‌టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, పాఠశాలల్లో పోలియో చుక్కలు వేశారు. వైద్యురాలు బ్రహ్మకుమారి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు తదితరులు పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : మండలంలో పల్స్ పోలియో విజయవంతమైందని మండల వ్యాప్తంగా 3,524 పిల్లలు ఉండగా 3459 మందికి పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ హిమ శ్వేత తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సూపర్‌వైజర్ బాషా, ఫార్మసిస్ట్ అరుణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుల్లంపేట: మండలంలో పల్స్‌పోలియో 97.7 శాతం పూర్తి చేసినట్లు డాక్టర్ సానె శేఖర్ తెలిపారు. మండలంలో 4494 మంది చిన్నారులు ఉండగా 4390 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన వారికి ఇంటింటికి వెళ్లి వేస్తామన్నారు. పుల్లంపేటలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

నందలూరు : మండలంలో 3874 మంది చిన్నారులుండగా 3849కి పోలియో చుక్కలు వేశారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ జంబు సూర్యనారాయణ, నల్ల తిమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ జేసీబీ సుబ్బారెడ్డి, గీతాల నరసింహారెడ్డి పోలియో చుక్కలు వేశారు. డాక్టర్ కార్తీక్ విశ్వనాధ్, సీహెచ్‌వో వెంకటనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ సునీల్, పీహెచ్ ఎన్ శైలజ, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: మండలంలో 3115 మంది పిల్లలుండగా 3052 మందికి పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి సుమలత తెలిపారు,48 కేంద్రాలు, 5రూట్లు, ఐదుగురు సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు,



పెనగలూరు: పోలియో చుక్కలు వేస్తున్న వైద్య బృందం



రామాపురం: పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ వెంకటరమణ



సంబేపల్లెలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



ఒంటిమిట్ట: పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



పుల్లంపేటలో పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ శ్రీనివాసులు



నందలూరు: పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



కోడూరులో చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



వీరబల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి

ఆర్ఎంపీల సంఘం జోనల్ సెక్రటరీగా డీవీఎస్ రాజు



ఆర్ఎంపీ డీవీఎస్ రాజును సన్మానిస్తున్న గ్రామీణ వైద్య సంక్షేమ సంఘ సభ్యులు

రాజంపేట టౌన్, మార్చి 3: అన్నమయ్య గ్రామీణ వైద్య సంక్షేమ సంఘం రాయలసీమ జోనల్ సెక్రటరీగా డాక్టర్ డీవీఎస్ రాజు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మండల పరిధిలోని బోయనపల్లెలో ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రథమ చికిత్స వైద్యుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలోని పలువురు ఆర్ఎంపీలు ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొని డాక్టర్ ఆయనను ఘనంగా సన్మానించారు.

పొలాలను కాపాడిన ఫైర్ సిబ్బంది

ఓబులవారిపల్లె, మార్చి 3 : కడప-చెన్నై జాతీయ రహదారి మధ్యలో రెడ్డిపల్లె చెరువు పొలాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో ఆ దారిలో వెళుతున్న బీజేపీ యువ నాయకుడు జైభరత్‌రెడ్డి వెంటనే స్పందించి 101 ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన రాజంపేట అగ్నిమాపక సిబ్బంది రైతుల పొలాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు జైభరత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఫైర్ ఆఫీసరు మాబుసుభాన్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ రవీంద్ర, సిబ్బంది చక్రవర్తి, శివయ్య, రాజేశ్వర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

గంగమ్మకు ఘనంగా పూజలు

లక్కిరెడ్డిపల్లె మార్చి 3: అనంతపురం గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. ఆలయ ఈఓ రవీంద్రరాజు జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. భక్తులకు తాగునీరు అన్ని వసతులు ఏర్పాటు చేశారు. త

ఏపీఎండీసీ నిర్లక్ష్యం.. వాహనదారులకు శాపం

ఓబులవారిపల్లె, మార్చి 3: ఏపీఎండీసీ నిర్లక్ష్యం కారణంగా జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏపీఎండీసీ స్టాక్ పాయింట్ నుంచి ముగ్గురాయిని మిల్లులకు తరలించే లారీలకు వెనుక వైపు డోర్లు లేకున్నా వాటిని అనుమతిస్తుండడంతో రవాణా సమయంలో ఖనిజం జాతీయ రహదారి వెంట పడిపోతోంది. భారీ వాహనాలు వాటిపై వెళుతుండడంతో అది దుమ్ముగా మారి వాహనదారులకు ప్రమాదకరంగా పరిణమిస్తోంది. ద్విచక్ర వాహనదారులు దుమ్ము కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. కింద పడిన రాళ్ల కారణంగా వాహనాలు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. పత్రికలలో కథనాలు వచ్చినప్పుడు మాత్రమే ఏపీఎండీసీ అధికారులు రోడ్డు భద్రతకు సంబంధించి తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటుండడంతో తమ ప్రాణాలకు భద్రత కరువైందంటూ వాహనాదారులు వాపోతున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లేందుకు అవకాశం లేకుండా మట్టి ఉండటం ప్రమాదకరంగా మారిందని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డోరు లేకుండా జాతీయ రహదారిపై వెళుతున్న లారీ

న్యాయవాది లక్ష్మీనారాయణకు సన్మానం

రాజంపేట టౌన్, మార్చి 3: ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సమావేశంలో తనను సన్మానించారని రాజంపేటకు చెందిన న్యాయవాది లక్ష్మీనారాయణ ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మానవ హక్కులు, వాటి పరిరక్షణ, మానవ హక్కులకు భంగం కలిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, న్యాయ సలహాలు తదితర అంశాలు కౌన్సిల్ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిపారు. సేవా, న్యాయవాద సలహాలలో తన ప్రతిభను గుర్తించిన కౌన్సిల్ సభ్యులు శాలువా, మెమొంటోతో సత్కరించినట్లు వివరించారు.



సన్మానం పొందుతున్న లక్ష్మీనారాయణ

ఎన్నికల అధికారులు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

కలకడ, మార్చి 3:ఎన్నికల అధికారులు వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాబుష్యూరిటీ-భవిష్యత్‌గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కలకడ మండలం ఎనుగొండపాలెం, దిగువ తాండలో పర్యటించిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల తాయిలాలుగా చీరలను పంపిణీ చేస్తున్న వైసీపీపై ఎన్నికల కమిషన్ సూమోటాగా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే మంచి రోజులు వస్తాయని భరోసా కల్పించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన పార్టీలను ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్, బరకం శ్రీనివాసులరెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, తిరుపతినాయుడు, శేఖర్‌నాయుడు, శ్రీనివాసులనాయుడు, కేశవులనాయుడు, వాటర్‌షెడ్ రవి, మల్లికార్జున్ నాయుడు, ఆనంద్‌రెడ్డి, తారక, మున్వర్, రెడ్డెప్పరెడ్డి, బత్తల హరిలు పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీసు రూల్సు సమస్యలను వెంటనే పరిష్కరించాలి

పీలేరు, మార్చి 3: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి సర్వీసు రూల్సు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో ఆదివారం జరిగిన ఆపస్ పీలేరు డివిజన్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్సుపై ఎన్నో ఏళ్లుగా కోర్టుల్లో ఉన్న కేసులను సాకుగా చూపుతూ ప్రభుత్వం టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వడం లేదన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్సుతో సంబంధం ఉన్న డైట్ లెక్చరర్లకు ప్రభుత్వం ఇటీవల తాత్కాలిక ప్రాతిపదికన సీనియర్ లెక్చరర్లుగా ప్రమోషన్లు కల్పించిందని, అదే తరహాలో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్లు, డైట్ లెక్చరర్లు, ఎంఈవోలు, డీవైఈవోలు వంటి పోస్టులకు ప్రమోషన్లు చేపట్టాలని ఆయన కోరారు. నూతనంగా ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌లకు శాశ్వత ప్రాతిపదికన పీజీటీలను నియమించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి దివాకర్ మాట్లాడుతూ జీవో నెం.117ను రద్దు చేసి ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని, ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ ప్రతి ఉన్నత పాఠశాలకు హెచ్ఎం, పీడీలను విధిగా కేటాయించాలని, డీఈవో పూల్‌లో ఉన్న పండిట్, పీఈటీలకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. జిల్లా కార్యదర్శి రమణా రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.57ను అనుసరించి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాపోరు

రైల్వేకోడూరు, మార్చి 3: మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీలోని అరుంధతి వాడ, చలంపాళెం, గిరిజన కాలనీల్లో ఆదివారం బీజేపీ నాయకులు ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రజాపోరు కన్వీనర్ నానబాల లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. కోడూరు అసెంబ్లీ కో-కన్వీనర్ తోట శ్రీనివాసులు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దాసరాజు జయప్రకాష్, నారాయణవర్మ, ఆర్ఎస్ఎస్ నేతలు తొండం చంద్రశేఖర్, తోట లక్ష్మీనారాయణ, తొండం శివయ్య, తొండం పద్మనాభయ్య, గజ్జల వెంకటరమణ, సిద్ధయ్య, కార్తీక్, హరీష్, చంగల్‌రాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోరుబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీనాయకులు

చిక్కాల జయలక్ష్మి స్మారక ప్రతిభ అవార్డులు

నందలూరు, మార్చి 3: 2023-24 విద్యాసంవత్సరంలో మండల స్థాయిలో పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కళాబంధు చిక్కాల బాలాజీరావు ఆధ్వర్యంలో ఆయన సతీమణి జయలక్ష్మి స్మారకార్థం రూ. 5 వేలు నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కన్వీనర్ అల్లం అశోక్‌కుమార్ తెలిపారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యం

ఒంటిమిట్ట, మార్చి 3: రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం తథ్యమని రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య అన్నారు. ఆదివారం స్థానిక హరిత హోటల్‌లో టీడీపీ నాయకులతో కలిసి పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి కడప జిల్లాలో 10 స్థానాలకు గానూ ఏడు స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థుల విజయదుందుభి కొనసాగుతుందని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. వైసీపీ తరచూ అభ్యర్థులను మార్చి గందర గోళానికి గురి చేస్తుందని ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి వైసీపీలో నెలకొందన్నారు. తన నీడను తానే నమ్మని జగన్ అయోమయంతో అభ్యర్థులను కూడా తరచూ మారుస్తున్నాడని ఎద్దేవా చేశారు. రాజంపేట పార్లమెంటు పరిధిలో ఐదు స్థానాల్లో టీడీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాజంపేట అసెంబ్లీ టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థిగా బలమైన సామాజిక వర్గ అభ్యర్థిని ప్రకటించాలని విన్నవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుభాన్‌బాషా, వినోద్‌రెడ్డి, మోదుగుల హరి, అయ్యవారయ్య, బాలకృష్ణ, నఫీల్లా, సంజీవరెడ్డి పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బాబు సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమం

రాజంపేట, మార్చి3 : టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బాబు సూపర్ సిక్స్ పథకాలతోనే రాష్ట్రంలో సంక్షేమం చేకూరుతుందని టీడీపీ నాయకులు తెలిపారు. రాజంపేట మండల పరిధిలోని చవనవారిపల్లె, చుట్టుపక్కల గ్రామాల్లో రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రన్న ప్రభుత్వం వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకొస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంచాల కోటయ్యనాయుడు, శవన పాపయ్యనాయుడు, డి.రవీంద్ర, దాసరి హరి, ఈనరాతి కృష్ణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతున్న టీడీపీ నేతలు

నా ఓటే.. నా భవిష్యత్తు వాల్‌పోస్టర్ల విడుదల

రాజంపేట టౌన్, మార్చి 3: నా ఓటే నా భవిష్యత్తు పోటీలో పాల్గొని రెండు లక్షల రూపాయల బహుమతులు పొందాలంటూ రూపొందించిన వాల్‌పోస్టర్లను టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, సభ్యులు స్థానిక టీఎన్ఎస్ఎఫ్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటుపై ఒక మంచి సందేశాన్ని ఇచ్చే పోస్టర్, రీల్స్, కొటేషన్స్ పంపించాలని వాటిలో ఉత్తమంగా ఎన్నికైన వాటికి రెండు లక్షల రూపాయల నగదు బహుమతి ఉంటుందన్నారు. అందుకు గానూ ఈ నెల 4వ తేదీలోపు నమోదు చేసుకోవాలని, మార్చి 12వ తేదీన మంచి సందేశం పంపిన వారిలో ఒకరిని ఎన్నుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ టుమారో కార్యనిర్వాహకులు వెంకటేష్, హరి, సాయి, శంకర్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఇంటింటా యల్లటూరు ప్రచారం

రాజంపేట, మార్చి3 : రాజంపేట పట్టణంలోని టి.అగ్రహారం తదితర ప్రాంతాల్లో జనసేన నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆదివారం అగ్రహారంలో గంగమ్మకు పూజలు చేసిన యల్లటూరు శ్రీనివాసరాజు తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు కొండేటి రవికుమార్, సింగంశెట్టి నరేంద్ర, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యల్లటూరు శివరామరాజు, పోకల ప్రభాకర్, టీడీపీ నేతలు ఆదమరాజు శ్రీనివాసులరాజు, గుణకల చిన్న, శివ తదితరులు పాల్గొన్నారు.



జనసేన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు

మోడెం వీరాంజనేయప్రసాద్ బీజేపీలో చేరిక

రాయచోటిటౌన్,మార్చి3: చిన్నమండెం జెడ్పీటీసీ సభ్యురాలి కుమారుడు తొగటవీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయప్రసాద్ ఆదివారం విజయవాడలో బీజేపీ రాష్ట్రశాఖ కార్యాలయంలో బీజేపీ జాతీయ జాయింట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ శివప్రకాశ్, రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుకర్, స్టేట్ జనరల్ సెక్రటరీ బిట్ర శివనారాయణ, రాజంపేట పార్లమెం టరీ అధ్యక్షుడు సాయి లోకేశ్ సమక్షంలో భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకు న్నారు. ఈయన తల్లి చిన్నమండెం జెడ్పీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు.



రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని సన్మానిస్తున్న వీరాంజనేయప్రసాద్

22 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, మార్చి 3: మండ ల పరిధిలోని లయన్స్ కంటి ఆసు పత్రిలో ఆదివారం 45 మందికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 22 మందికి ఆపరేషన్లు చేశారు. ఆపరేషన్ చేయించుకున్న 38 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వ హించి అద్దాలు, మందులు పంపి ణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మాజీ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్లకు ఎంపిక చేస్తున్న వైద్యులు

ఆలయ అభివృద్ధికి రూ.15 వేలు విరాళం

సుండుపల్లె, మార్చి 3: మండలంలోని ఆరోగ్యపురం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అదే గ్రామ పంచాయతీకి చెందిన నగేశ్ కుటుంబ సభ్యులు రూ.15 వేలు అందజేసినట్లు ఆలయ అర్చకుడు అమ్మనాయక్ తెలిపారు. ఆలయంలోని గోపురానికి పెయింటింగ్ చేయించేందుకు ఈ మొత్తం అందజేసినట్లు వారు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం చేసిన భక్తుల పేరుతో పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి విరాళాలు అందజేస్తే ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని కోరారు.

గంగమ్మ ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

లక్కిరెడ్డిపల్లె మార్చి 3; ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గంగమ్మజాతర సందర్భంగా ఆలయ ఆవరణలో ఆదివారం సుమారు రూ.2 లక్షల వ్యయంతో 19 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సుమారు 2 లక్షల మందికి తగిన విధంగా తాగునీరు, ట్రాఫిక్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. గంగమ్మ దేవాలయం ఆవరణమంతా 2లక్షల రూపాయాలతో 19 సిసి కెమరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహిస్తుట్లు సిఐ జీవన్ గంగనాథబాబు తెలిపారు

నేటినుంచి హజరత్ షా అలీ దర్గాలో ఉరుసు

చిన్నమండెం, మార్చి 3: మండల కేంద్రంలోని హజరత్ షా అలీ గంజే షాహిద్‌బాబా రహంతుల్లా అలైహి దర్గాలో కడప పెద్ద దర్గా గురువు హజరత్ ఖ్వాజా సయ్యద్ ఆరీఫుల్లా మహమ్మద్ హుస్సేయిని ఆధ్వర్యంలో సోమవారం గంధం, మంగళవారం ఉరుసు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపా రు. సోమవారం రాత్రి 9 గంటలకు నాయబ్ సాబ్ వారి ఇంటి నుంచి గంధం బయలుదేరి దర్గాకు చేరుకుంటుంది. అదే రోజు ఖవాలి షాహియా వార్సి, అమీన్‌తాజ్ చిస్తీ మధ్య ఖవ్వాలి పోటీలు, షాబాద్ కుమారుల ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉరుసు కార్యక్రమం, చోటి తమన్న, ఆసద్‌నిషిత్ షాబరి మధ్య ఖవ్వాలి పోటీలు నిర్వహిస్తున్నారు. షాబాద్ కుమారుడు ఎజాస్ అలీఖాన్ ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.



ఉరుసుకు ముస్తాబైన దర్గా

అధికార పార్టీ నాయకుల బరితెగింపు



ఎక్స్‌కవేటర్‌తో గుట్టను తొలగిస్తున్న దృశ్యం

- గుట్టలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ
- రెవెన్యూ సిబ్బందిపై అధికార పార్టీ నాయకుల ఆగ్రహం

ప్రభుత్వ భూములపై అధికార పార్టీ నాయకుల కన్ను పడితే చాలు గుట్టలు, ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు ఏమీ వదలడం లేదు. ఒకప్పుడు సెలవు దినాల్లో గుట్టుచప్పుడు కాకుండా చేసేవారు. ఇప్పుడు పట్టపగలే ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారు. జిల్లాలో వైసీపీ నాయకులు రోజురోజుకు బరి తెగిస్తున్నారు. పట్టపగలే యంత్రాలతో గుట్టలు, ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారు. పనులు ఆపేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులు, వీఆర్‌వో, వీఆర్‌ఏపై వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తాము ఆర్డీవోతో మాట్లాడామని, పనులు నిలిపేది లేదని యథేచ్ఛగా యంత్రాలతో పనులు చేపడుతున్నారు.

సంబేపల్లె, మార్చి 3: సంబేపల్లె మండలంలోని ఎస్.సోమవరం గ్రామ సర్వే నెంబర్ 86 ఊడ గానిగుట్ట ఇందులో ప్రభుత్వ భూమి 135 ఎకరాలు కలదు. సర్వే నెంబర్ 113, ప్రభుత్వ పోరంపోకు భూమి, సర్వే నెంబరు 114 ల్యాండ్ సీలింగ్ భూములు అనుకుని ఎర్రమొరంబండను స్థానిక వైసీపీ నాయకులు యంత్రాలతో వారం రోజులుగా చదును చేస్తున్నారు. రెండు రోజుల క్రితం రెవెన్యూ సిబ్బంది దృష్టికి ఈ విషయం రావడంతో వారు అక్కడికి వెళ్లి పనులు నిలబెట్టారు. తిరగి ఆదివారం ప్రభుత్వ కార్యాలయానికి సెలవు కావడంతో ఉదయం నుంచి యంత్రాలతో పనులు చేపట్టారు. ఈ విషయం తహసీల్దార్‌కు తెలియడంతో వీఆర్‌వో, వీఆర్‌ఏతో పాటు పోలీసు సిబ్బందిని పనులు నిలబెట్టాలంటూ పంపించారు. అయితే స్థానిక వైసీపీ నాయకులు వారిని లెక్క చేయలేదు. ఆర్డీవోతో తాము మాట్లాడామని పనులు నిలబెట్టకుండా యథేచ్ఛగా పనులు చేయడం విశేషం. ఇంత బరి తెగిస్తున్నారంటే వీరి వెనుక బలమైన నాయకుల అండదండలు ఉన్నాయని తెలుస్తోంది. జిల్లాస్థాయి అధికారులను తమ కనుసన్నల్లో ఉంచుకుని పనులు చేస్తున్నారని, స్థానికంగా పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడేది ఎవరు

జిల్లాలో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను అప్పనంగా కాజేసేందుకు అధికార పార్టీ నాయకులు ఎంతకైనా బరి తెగిస్తున్నారు. వాగు, వంక, పోరంబోకులు ఇలా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకడంతో ఇక ప్రభుత్వ భూములు కాపాడేది ఎవరని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఎస్.సోమవరంలో ప్రభుత్వ భూమి, గుట్టలు ఆక్రమణపై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా వీఆర్‌ఏ, పోలీసు సిబ్బందిని పనులు నిలబెట్టేందుకు పంపామని పరిశీలించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.



వీఆర్‌వో చెప్పినా వినకుండా చేస్తున్న పనులు

బంగారం పేరుతో మోసగించిన ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చైతన్య

రాజంపేటటౌన్, మార్చి 3: తక్కువ ధరకు బంగారం ఇస్తామని నమ్మబలికి ఓ వ్యక్తి నుంచి రూ.18 లక్షలు కాజేసిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు రాజంపేట డీఎస్పీ వి.ఎన్.కె. చైతన్య తెలిపారు. ఆదివారం రాజంపేట పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని చెప్పి రూ.18 లక్షలు తీసుకుని ముగ్గురు వ్యక్తులు తనను మోసగించారంటూ ఓబులవారిపల్లె మండలం యల్లాయపల్లెకు చెందిన చేకూరి రమణయ్య గతంలో ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ చిన్న రెడ్డయ్య కేసు నమోదు చేశాడన్నారు. కేసు దర్యాప్తులో నిందితులు మదనపల్లెకు చెందిన పర్వతాల సురేంద్ర, మాచంరెడ్డప్ప, ముంతల వెంకటేష్‌గా తేలడంతో, ఫోన్‌కాల్స్, ఆధునిక పరికరాల సాయంతో వారి ఆచూకి గుర్తించి అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.14.50 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు గతంలో కూడా కాళహస్తి, పీలేరు తదితర ప్రాంతాల్లో ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు డీఎస్పీ తెలియజేశారు. నిందితులను కోడూరు కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు రూరల్ సీఐ పి.సురేంద్ర నాథ్‌రెడ్డి, ఓబులవారిపల్లె పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లర దుకాణం దగ్ధం



చిల్లర దుకాణం కాలిపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధ దంపతులు

ఓబులవారిపల్లె, మార్చి 3: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో చిల్లర దుకాణం అగ్నికి ఆహుతైందని గోబూరివారిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన గుత్తి సుబ్బరాయుడు ఆరోపించారు. పెద్దఓరంపాడు సిద్దులమ్మ, గుత్తి సుబ్బరాయుడు గ్రామంలో చిల్లర దుకాణం నిర్వహిస్తుంటారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో నిద్ర లేచి చూడగా దుకాణం మంటల్లో కాలిపోవడం కనిపించింది. ముందు రోజే అంగడి సరుకులన్నీ తీసుకొచ్చామని, ఆధార్, ఆరోగ్యశ్రీ, గ్యాస్‌బుక్, పోస్టాఫీసు బుక్, రేషన్‌కార్డు, బంగారు కమ్మలు వంటివన్నీ కాలిపోయాయని, సుమారు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ యువ నాయకుడు జై భరత్‌రెడ్డి వృద్ధ దంపతులను పరామర్శించారు. వీఆర్వో మనోహర్ ఘటనపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అక్కమ్మ గారి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువతి మృతి



ప్రమాదంలో మృతి చెందిన శ్రీవిద్య

నందలూరు, మార్చి 3: ట్రాక్టర్ ఢీకొని ఓ యువతి మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు పాటూరు నబి కోటకు చెందిన చంద్రమోహన్ తన కూతురు శ్రీవిద్య (17)తో కలిసి ద్విచక్ర వాహనంలో నాగిరెడ్డిపల్లె వైపు వెళుతూ మూత్ర విసర్జన నిమిత్తం ప్రవీణ్ బ్రిక్స్ వద్ద వాహనాన్ని ఆపి పక్కకు వెళ్లాడు. అదే సమయంలో రోడ్డుపై నిలుచున్న శ్రీ విద్యను ట్రాక్టర్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చంద్రమోహన్, శివరాణి దంపతులకు ముగ్గురు కుమార్తెలుండగా, శ్రీ విద్య చిన్నకుమార్తె. నందలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ట్రాక్టర్ డ్రైవర్ చవ్వాకుల వెంకటరమణ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు.


177 మద్యం బాటిళ్లు స్వాధీనం



పోరుమామిళ్లలో ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటళ్లు

పోరుమామిళ్ల, మార్చి 3: ఆర్మీ మాజీ జవాన్లకు క్యాంటీన్ ద్వారా లభించే మద్యాన్ని పోరుమామిళ్లలోని శ్రీరామ్‌వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి నిల్వ ఉంచుకోవడంతో ఆ సమాచారం తెలుసుకున్న ఎస్‌ఈబీ ఎస్‌ఐ వరలక్ష్మీ, ఎక్సైజ్ సీఐ మంజుల ఆకస్మిక దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి 177 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఆదివారం పోరుమామిళ్లలో మద్యం డంప్ ఉన్న విషయం తెలుసుకున్నఎక్సైజ్ అధికారులు రంపాడు రోడ్డులో శ్రీరామ్ వెంకటసుబ్బయ్య ఇంట్లో తనిఖీలు చేయగా డంప్‌గా ఉంచిన 177 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చనిపోయిన గుర్తు తెలియని వ్యక్తి

ఖాజీపేట, మార్చి 3: కడప, కర్నూలు జాతీయ రహదారిలోని బుడ్డాయపల్లె సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. బుడ్డాయపల్లె సమీపంలో ఆదివారం ఉదయం భిక్షాటన చేసి రోడ్డు పక్కన పడిపోవడంతో ఆదారిన వెళ్లే ప్రజలు గమనించి స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే సీఐ రామాంజులు స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కడప రిమ్స్‌కు తరలించారు. ఇతని ఒంటిపై గీతల చొక్కా, జీన్స్‌ప్యాంట్ ఉందని, ఎవరైనా సమాచారం తెలిస్తే 9121100623కు సమాచారం ఇవ్వాలని సీఐ అన్నారు.

'విశ్వవిద్యాలయాలు పరిశోధన కేంద్రాలు కావాలి'

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 3: విశ్వవిద్యాలయాలు పరిశోధన ఆవిష్కరణ కేంద్రాలు కావాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసరు హేమ చంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఏపీ విద్యా ప్రణాళిక బోర్డు ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, డైరెక్టర్లకు గుంటూరులో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైవీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ ప్రతినిధులుగా హాజరయ్యారు.

కాంగ్రెస్ నేత గోల్డ్ అల్లాబకాష్ టీడీపీలో చేరిక

- కండువా కప్పి ఆహ్వానించిన సుగవాసి సుబ్రమణ్యం



రాయచోటి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అభ్యర్థి గోల్డ్ అల్లాబకాష్ టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సుగవాసి సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, మార్చి 3: సీనియర్ కాంగ్రెస్ నేత గోల్డ్ అల్లాబకాష్, మరికొందరు మైనారిటీ నాయకులు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో హోటల్ ఫరూక్ ఇంట్లో నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశంలో టీడీపీ సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు కండువా కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. మైనార్టీ నేతలు వారికి శాలువా కప్పి పూలదండతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఖాదర్ బాషా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు రాయచోటిని అభివృద్ధి చేశారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో రాయచోటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యంను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్, సైఫుల్లా, ఇర్షాద్ అబూబకర్, హబీబుబర్, హోటల్ ఫారూఖ్, సయ్యద్, గోపాల్, బీడీ రెడ్డి, కూరగాయల ఖాజా, పైజాన్, ఫిరోజ్, సౌకత్, మొయినుద్దీన్, ఆరీఫ్, సుల్తాన్, చిక్కా ఫయాజ్, కొంత మంది ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

వైసీపీని గెలిపిస్తే దళితుల బతుకులు మృగ్యం

- మాదిగ మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

కడప(మారుతీనగర్), మార్చి 3: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో మరోసారి వైసీపీ వస్తే దళిత, గిరిజనుల బతుకులు మృగ్యం అవుతాయని మాదిగ మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బి.ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్త జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం కడప ప్రెస్‌క్లబ్‌లో మాదిగ మహానాడు జిల్లా అధ్యక్షుడు గున్నా జయరాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాల పదినెలల వైసీపీ పాలనలో దళితులపై దాడులు, హత్యలు, బెదిరింపులు, మహిళలపై అత్యాచారాలు పెచ్చుమీరాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో మాస్కులు లేవన్న పాపానికి దళితుడైన డాక్టర్ సుధాకర్‌ను పట్టపగలే నడిరోడ్డుపై చిత్రహింసలకు గురిచేసి ఆయన మృతికి వైసీపీ ప్రభుత్వం కారణమైందన్నారు. ముఖ్యంగా దళితుల అభివృద్ధి, సంక్షేమం నిమిత్తం కేంద్రం ద్వారా రాష్ట్రానికి వచ్చే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కూడా దళితులకు ఇవ్వకుండా దారి మళ్లించి, దళిత, గిరిజనుల నోట్లో జగన్‌రెడ్డి మట్టికొట్టారని ధ్వజమెత్తారు. దీంతో పాటు గత కొన్ని సంవత్సరాలుగా దళితులకు చేయూతనిచ్చే ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లలో నిధులను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా గతంలో ఎస్సీ కార్పొరేషన్, లిడ్‌క్యాప్ ద్వారా దళితులకు సబ్సిడీ రుణాలు అందేవని, వాటి ద్వారా అంతో ఇంతో ఏదేని వ్యాపారాలు, చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించే వారన్నారు. ఇప్పటికైనా దళితులు మరోసారి మోసపోకుండా వైసీపీని గద్దె దించేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాదిగ మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి ఎ.ప్రకాష్, కమిటీ ఆర్గనైజర్ బి.బాజి, ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షుడు వై.విజయ్, నగర కమిటీ నాయకులు రమణయ్య, గోపయ్యతో పాటుగా సురభి రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దీనదయాల్ కుటుంబ సభ్యులు

సీకేదిన్నె, మార్చి 3: చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లె అభయ ఆంజనేయస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి గాను గ్రామానికి చెందిన వెంకటేశ్వర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వినుకోలు దీనదయాల్ కుమారుడు సుభాష్ సతీమణి అరుణకుమారి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం అందజేశారు. అడిగిన వెంటనే ఆలయ నిర్మాణం కోసం సానుకూలంగా స్పందించి చందా అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్వామివారి ఆశీస్సులు వారి కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని కోరుతున్నారు.

ఆలయానికి రూ.50 వేలు వితరణ



నగదు వితరణ చేస్తున్న కాంతమ్మ

కడప(కల్చరల్), మార్చి 3: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలో వెలసిన పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ అభివృద్ధికి కాంతమ్మ అనే భక్తురాలు ఆదివారం రూ.50 వేలు విరాళంగా అందించారు. ప్రతిరోజు కూలి పనిచేసే ఆమె రోజువారిగా రూ.200 జమచేసి మొత్తంగా రూ.50 వేలు ఇవ్వడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

సంతానలక్ష్మీకి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, మార్చి 3: మండలంలోని చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధికంగా రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి.

జీవితంలో ప్రతి సమస్యకూ పరిష్కారం



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

కడప(ఎడ్యుకేషన్), మార్చి 3: జీవితంలో సమస్యలు చుట్టుముట్టినప్పుడు వాటిని పరిష్కరించే ఆలోచన చేస్తే తప్పక మార్గం కనిపిస్తుందని వైవీయూ సైకాలజీ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ లలిత పేర్కొన్నారు. ఆదివారం పెండ్లిమర్రి మండలం వేలూరుపాడు గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించి ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ వెళ్లి రైతులు, వృద్ధులు, మహిళలు, యువకులను కలిసి ఆత్మహత్యల నివారణపై చైతన్యం కల్పించారు. జీవితం విలువ ప్రాముఖ్యతను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, బయోటెక్నాలజీ, సైకాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు, మార్చి 3: మండల పరిధిలోని సి.కొత్తపల్లె గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ వెంకటరమణ తన సిబ్బందితో దాడి చేసి అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు సి.కొత్తపల్లె గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న వ్యక్తిపై దాడిచేసి అతని వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేకంగా మద్యం అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఏఎస్‌ఐ మోహన్‌తో పాటు కానిస్టేబుళ్లు ఉన్నారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్టు - నగదు స్వాధీనం

ఓబులవారిపల్లె, మార్చి 3: మండలంలోని బొమ్మవరం పరిసర ప్రాంతాల్లో కోడిపందేలు ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. గ్రామ పరిసరాలలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకొని, 5700 నగదు, నాలుగు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం


చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఆర్డీవో హరిప్రసాద్


కలకడలో పోలియో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో కొండయ


పీలేరులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె/టౌన్/అర్బన్, మార్చి 3: పోలియో రహిత సమాజమే లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. రెండు పోలియో చుక్కలు చిన్నారుల నిండు జీవితానికి రక్ష అని ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా స్థానిక రామారావు హైస్కూల్ వద్ద ఆర్డీవో హరిప్రసాద్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు పోలియో సోకితే జీవితాంతం అంగవైకల్యంతో అవస్థలు పడేవారని, ప్రభుత్వాలు పోలియో వ్యాధిని తుడిచి పెట్టేందుకు పోలియో వాక్సిన్ కనిపెట్టి 0-6 ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులకు వేయిస్తున్నారన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లో 497 కేంద్రాల వద్ద వైద్య, ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారన్నారు. మొత్తం మదనపల్లె డివిజన్‌లో 87,179 మంది చిన్నారులకు గాను సాయంత్రానికి 86,276 మందికి పోలియో చుక్కలు వేసి 99శాతం సాధించామన్నారు. మదనపల్లె పట్టణంలో 67 చోట్ల పోలియో సెంటర్లు ఏర్పాటుచేశామని ఆర్టీసీ బస్టాండు, సీటీఎం రైల్వేస్టేషన్, మున్సిపల్ కార్యాలయం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. కాగా ఈశ్వరమ్మకాలనిలో మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కురవంక గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ చిప్పిలి చలపతి చిన్నారులకు పోలియో చుక్కలువేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వి.మనూజ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీవైస్‌ఛైర్మన్ ఎన్.ఇర్ఫాన్‌ఖాన్, పిపి యూనిట్ మెడికల్ ఆఫీసర్ గంగాభవానీ, డాక్టర్ గాయత్రి, మున్సిపల్ ఏఎస్‌వో వెంకటేశ్వర్లు నాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య, కౌన్సిలర్ ఎస్.ముబీన, ప్రసాద్ బాబు, తదితరులు పాల్గొన్నారు. మదనపల్లె పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ పార్టీ రాజంపేట పార్లమెంట్ నాయకుడు, పుంగనూరు కన్వీనర్ సింగం రామకృష్ణారెడ్డి తన అనుచరులతో కలిసి పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీదేవి, ఈశ్వర్, పవన్‌కుమార్‌రెడ్డి, సైదాని, రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే మదనపల్లె యూత్ అధ్యక్షుడు ఏఆర్ సురేష్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్స్ పోలియా సందర్భంగా ర్యాలీని నిర్వహించారు.

గుర్రంకొండలో: చిన్నారులకు ఫల్స్‌పోలియో సోకకుండా చూడడమే లక్ష్యమని డీఎంహెచ్‌వో కొండయ్య అన్నారు. ఫల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం గుర్రంకొండలోని పలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పట్టిన పిల్లల నుంచి 5 ఏళ్లలోపు పిల్లలందరికీ ఫల్స్‌పోలియో చుక్కలను వేయించాలన్నారు. అనంతరం గుర్రంకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో గుర్రంకొండ ఆసుపత్రి పరిధిలో 2811 మందికి గాను 2703 మందికి, తరిగొండ ఆసుపత్రిలో పరిధిలో 1956 మందికిగాను 1903 మందికి ఫల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్లు రవీంద్రనాయక్, సులక్షణ తెలిపారు. ఈ రెండు ఆసుపత్రిలో పరిధిలో 96 శాతం పోలియో కార్యక్రమం నమోదైనట్లు తెలిపారు.

కలకడలో: పిల్లలందరికీ ఫల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా చుక్కలు వేసి లక్ష్యాలను పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో కొండయ్య సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఆయన మండలంలోని కోన, కదిరాయచెరువులో కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కాగా ఎర్రకోటపల్లె ఆసుపత్రి పరిధిలో 1829గాను 1809 మందికి, కలకడ ఆసుపత్రి పరిధిలో 2284 గాను 2262 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్లు కిషోర్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున్, జవహర్‌బాబులు తెలిపారు.

నిమ్మనపల్లిలో: మండలంలో పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమం విజయవతంగా ముగిసినట్లు వైద్యాధికారి రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 0నుంచి 5ఏళ్లలోపు వయస్సు కలిగి చిన్నారులు 3913మంది ఉండగా వారిలో 99శాతం మందికి పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: స్థానిక జడ్పీ హైస్కూల్ కేంద్రంలో వైద్యాధికారిణి రేష్మా బేగం పిల్లకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో మొత్తం 5419 మంది పిల్లకు గానూ 5272 మందికి పోలియో చుక్కలు వేసినట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమాల్లో సీహెచ్‌వోలు షకీలాబేగం, సందీపా పాల్గొన్నారు.

పీలేరులో: మండలంలో ఆదివారం జరిగిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. పీలేరు మండలంలో 0-5 ఏళ్లలోపు ఉన్న చిన్నారులు 8361 మంది ఉండగా మండలంలోని తలపుల, రేగళ్లు పీహెచ్‌సీల సిబ్బంది 8198(98 శాతం) మందికి చుక్కలు వేశారు. పల్స్ పోలియో కార్యక్రమ జిల్లా పరిశీలకులు, ఎండమాలజిస్టు వెంకటేశ్ పీలేరు, కేవీపల్లె మండలాల్లో పర్యటించి కార్యక్రమాన్ని పరిశీలించారు. పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె, కేవీపల్లె మండలం గుండ్రేవారిపల్లెలో జరిగిన శిబిరాన్ని సందర్శించి సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. ఆదివారం చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులకు సోమవారం, మంగళవారాల్లో వాళ్ల ఇంటి వద్దనే వేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రమేశ్ రెడ్డి, చంద్రశేఖర్ నాయక్, కార్తీక్ కుమార్, సీహెచ్‌వో జయలక్ష్మి, హెచ్‌ఈలు ఉషారాణి, కొండయ్య, సూపర్‌వైజర్లు కుసుమ, రమాదేవి, చిన్నప్ప, అంగన్‌వాడీ, ఆశాలు పాల్గొన్నారు.

వాల్మీకిపరంలో: పుట్టిన ప్రతి బిడ్డకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ కీర్తి పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి, నగిరిమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 5200మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసి 96శాతం కార్యక్రమం విజయవంతమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీవిద్య, మహ్మద్‌వసీం, నయీం, సూపర్‌వైజర్ సుధాకర్, ఇందిరారాణి, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు వైద్యాధికారి అనుమప తెలిపారు. మండలంలో 33 కేంద్రాలలో 0-5 సంవత్సరాల లోపు చిన్నారులు 4727 మంది లక్ష్యం కాగా 4718 మందికి 99.8 శాతం మొదటి రోజు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరిలో: మండలంలో ఏర్పాటు చేసిన 35 కేంద్రాల్లో ఆదివారం 5753 మంది చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు మేడికుర్తి వైద్యాధికారి డాక్టర్ చిన్నరెడ్డెప్ప తెలిపారు. మొత్తం 5849 మంది పిల్లలు అర్హులు కాగా 98 శాతం మందికి పూర్తి చేశామన్నారు. మిగిలిన వారందరికీ సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి పూర్తి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ చిన్నరెడ్డెప్ప, డాక్టర్ కావ్యగంధ, హెచ్ఎస్ హేమలత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: మండలంలో 4020 మంది చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్లు ఇమ్మానుయేల్, హరివర్మ తెలిపారు. 30 పల్స్‌పోలియో కేంద్రాల్లో 130 మంది వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో పల్స్ పోలియో చుక్కలు వేయించుకోని వరి కోసం ఈ కార్యక్రమం మరో రెండు రోజులు కొనసాగిస్తామన్నారు. ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్, జడ్పీటీసీ పీరమ్మ, పీహెచ్‌సీ సీహెచ్‌వో క్రిష్ణయ్య పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని బి.కొత్తకోట, పీటీఎం మండలాలకు సంబంధించిన 5 సంవత్సరాల పిల్లలకు 10621 మందికి అంగన్‌వాడీ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు పల్స్ పోలియో చుక్కలు వేశారు. 5 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలను వేశారు. మండల అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు నిజమైతే చీరల పంపిణీ ఎందుకు?

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్ రెడ్డి నిలదీత


సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, మార్చి 3: ఒక్కో అక్క చెల్లెమ్మకు సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది రూపాయల అందజేశామని చెపుతున్న వైసీపీ నాయకులు ఇప్పుడు చీరలు నెలన్నర ముందుగానే ఎందుకు పంచుతున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. రాజంపేట నుంచి పీలేరు వరకూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంపీ మిథున్ రెడ్డి చీరల పంపిణీని మొదలు పెట్టారని, అక్రమ సంపాదనతో కూడబెట్టిన అవినీతి సొమ్ముతో కొన్న చీరలతో ఓటర్లకు గాలం వేస్తున్నారని విమర్శించారు. ఆదివారం మండలంలోని నగరిపల్లెలో జరిగిన ఆరు మండలాల టీడీపీ, జనసేన శ్రేణుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరాచకాలు, అక్రమాలు, దోపిడీలతో ఐదేళ్లు పరిపాలించిన జగన్మోహన్ రెడ్డి ఇక ఏమీ లేక ఆఖరుకు రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టేశారని ఇంతకన్నా ఘోరం చరిత్రలో లేదని విమర్శించారు. సమావేశంలో ఆరు మండలాల మండల టీడీపీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, ప్రభాకర్ నాయుడు, నిజాముద్దీన్, జగదీష్, మల్లికార్జున రెడ్డి, గీతాంజలి, నాయకులు మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వర రావు, దద్దాల హరిప్రసాద్, అగ్రహారం అమరనాథరెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, కలికిరి సర్పంచు ప్రతాప్ కుమార్ రెడ్డి, సుధాకర్ నాయుడు, వలిగట్ల వెంకట్రమణ, బూత్, కస్టర్ ఇన్‌చార్జీలు, అనుబంధ విభాగాల నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

వాల్మీకిపురం, మార్చి 3: నియోజకవర్గంలో ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ పార్టీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చింతపర్తి సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తిరుపతి వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించి 300మందికి పైగా ఉచిత కంటి వైద్య పరీక్షలు చేశారు. 60మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి, శిబిరంలో పాల్గొన్న వారికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, పీలేరు పార్టీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లె మధు, డాక్టర్లు లహరి, చాందిని, క్యాంప్ ఆర్గనైజర్ గౌరీశంకర్, నాయకులు ద్వారకనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గుర్రెడ్డి చంద్రారెడ్డి, మనోహర్, కేవీ రెడ్డి, గోపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్ అపద్దాల హామీలను ప్రజలు నమ్మరు


పత్తేపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

వాల్మీకిపురం, మార్చి 3: సీఎం వైఎస్ జగన్ అపద్దాల హామీలను నమ్మేస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పత్తేపురం గ్రామంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను రూపొందించిన కరపత్రాలను ఇంటింటా పంచుతూ ముమ్మర ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని టీడీపీ, జనసేన ఉమ్మడిగా అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వల్లిగట్ల వెంకటరమణ, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ బాషా, రాజంపేట పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్రాచారి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు కోసూరి రమేష్, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, తెలుగు యువత చాను, కువైట్ సయ్యద్‌బాషా, అడ్వకేట్ రమణ, స్వర్ణలత, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో టీడీపీ-జనసేన జెండాలను ఎగరేస్తాం

● జన్మదిన వేడుకల్లో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి


కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 3: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల జెండాలను తంబళ్లపల్లె గడ్డపై ఎగరేస్తామని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక కేజీఎన్ కళ్యాణమండపంలో ఆదివారం టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబీకుల మధ్య ఆయన భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క టీడీపీ నాయకుడు, కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. అంతకు ముందు ములకలచెరువులో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్ధా, వైజీ సురేంద్రయాదవ్, రెడ్డెప్పరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రయాదవ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కువైట్ శంకర్, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, టీడీపీ నేతలు యర్రగుడి సురేష్, చెన్నకిష్టా, కేవీ రమణ, ముత్తుకూరు మౌళా, జేసీబీ సుధాకర్‌నాయుడు, సిద్దా భాస్కర్‌నాయుడు, నానబాల ప్రసాద్, నరసింహారెడ్డి ఆరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు యువత చేరిక


యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు

మదనపల్లె, మార్చి 3: రామసముద్రం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 70 మంది యువకులు జనసేన పార్టీలో చేరారు. స్థానిక బర్మావీధిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారంతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు, పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. అధినేత ఆదేశానుసారం సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలుపించుకుంటామని యువకులు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, దారం హరిప్రసాద్, శంకర్, అశోక్, ధరణి, సోను, సుప్రీంహర్ష, నవాజ్, శేఖర్, సాయి, భాను, సందీప్, నవీన్, కౌశిక్, పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

కలకడ, మార్చి 3:ఎన్నికల అధికారులు వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాబుష్యూరిటీ-భవిష్యత్‌గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కలకడ మండలం ఎనుగొండపాలెం, దిగువతాండలో పర్యటించిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల తాయిలాలుగా చీరలను పంపిణీ చేస్తున్న వైసీపీపై ఎన్నికల కమిషన్ సూమోటాగా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే మంచి రోజులు వస్తాయని భరోసా కల్పించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన పార్టీలను ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్, బరకం శ్రీనివాసులరెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, తిరుపతినాయుడు, శేఖర్‌నాయుడు, శ్రీనివాసులనాయుడు, కేశవులనాయుడు, వాటర్‌షెడ్ రవి, మల్లికార్జున్ నాయుడు, ఆనంద్‌రెడ్డి, తారక, మున్వర్, రెడ్డెప్పరెడ్డి, బత్తల హరిలు పాల్గొన్నారు.

దాడిలో వ్యక్తి మృతి ముగ్గురిపై హత్య కేసు నమోదు

ములకలచెరువు, మార్చి 3: భూమి విషయమై అన్నాతమ్ముల మధ్య గొడవ ఘటనలో అన్న మృతి ముగ్గురిపై హత్య కేసు నమోదు చేసిన పోలీసులు. పోలీసుల కథనం మేరకు...ములకలచెరువు మండలం గాలేటివారిపల్లెకు చెందిన అన్నాతమ్ములు పూజారి కృష్ణప్ప, శ్రీరాములు భూమి విషయమై శనివారం గొడవ పడ్డారు. గొడవలో తమ్ముడు శ్రీరాములు, అతని భార్య శాంతమ్మ, కుమారుడు సురేష్ కట్టె తీసుకుని కృష్ణప్ప తలపై గట్టిగా కొట్టారు. అంతటి ఆగకుండా కాళ్లతో తన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ కృష్ణప్పను చికిత్స నిమిత్తం కుటుంబీకులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి కృష్ణప్ప మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు తమ్ముడు కుటుంబానికి చెందిన ముగ్గురిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. కాగా కృష్ణప్ప మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రభుత్వం పట్టా ఇచ్చినా.. దౌర్జన్యంగా ఆక్రమించారు

మదనపల్లె టౌన్, మార్చి 3: ప్రభు త్వం తనకు 11 ఏళ్ల క్రితం మంజూ రు చేసిన ఇంటి పట్టా స్థలాన్ని కొంద రు ఆక్రమించి షెడ్డు నిర్మించార ని బాధితు రాలు షేక్ షకీరా ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక చేంద్రాకాలని వద్ద బాధితురాలు మాట్లాడుతూ 2013లో తన పేరిట ప్రభుత్వం సర్వే నెంబర్ 528లో ప్లాట్ నెంబర్ 14 ఇంటి పట్టా మంజూరు చేశారన్నారు. ఆర్థిక స్థోమత లేక పునాదుల వరకే నిర్మించామని, ఇటీవల కొందరు తాను నిర్మించిన పునాదులను ఆక్రమించుకుని షెడ్డు నిర్మిస్తున్నార న్నారు. ఈ విషయమై గత సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టరే ట్‌లో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేయగా దీనిపై విచా రించి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో తహసీల్దార్‌కు రెఫర్ చేశా రన్నారు. ఇది జరిగి ఆరు రోజులవుతూనే ఆదివారం కొంత మంది దౌర్జన్యంగా తాను నిర్మించిన పునాదులపై షెడ్డు నిర్మిం చి పైకప్పుగా రేకులు కూడా వేసేశార న్నారు.

కాంగ్రెస్ నేత గోల్డ్ అల్లాబకష్ టీడీపీలో చేరిక

● కండువా కప్పి ఆహ్వానించిన సుగవాసి సుబ్రమణ్యం


రాయచోటి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అభ్యర్థి గోల్డ్ అల్లాబకష్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సుగవాసి సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, మార్చి 3: సీనియర్ కాంగ్రెస్ నేత గోల్డ్ అల్లాబకష్, మరికొందరు మైనారిటీ నాయకులు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో హోటల్ ఫరూక్ ఇంట్లో నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశంలో టీడీపీ సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు కండువా కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. మైనార్టీ నేతలు వారికి శాలువా కప్పి పూలదండతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఖాదర్ బాషా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు రాయచోటిని అభివృద్ధి చేశారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో రాయచోటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండి ఎల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యంను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్, సైఫుల్లా, ఇర్షాద్ అబూబకర్, హబీబుబర్, హోటల్ ఫారూఖ్, సయ్యద్, గోపాల్, బీడీ రెడ్డి, కూరగాయల ఖాజా, ఫైజాన్, ఫిరోజ్, సౌకత్, మొయినుద్దీన్, ఆరీఫ్, సుల్తాన్, ఫయాజ్, ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీసు రూల్సుపై అలసత్వం వద్దు

పీలేరు, మార్చి 3: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి సర్వీసు రూల్సు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్సుతో సంబంధం ఉన్న డైట్ లెక్చరర్లకు ప్రభుత్వం ఇటీవల తాత్కాలిక ప్రాతిపదికన సీనియర్ లెక్చరర్లుగా ప్రమోషన్లు కల్పించిందని, అదే తరహాలో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్లు, డైట్ లెక్చరర్లు, ఎంఈవోలు, డీవైఈవోలు వంటి పోస్టులకు ప్రమోషన్లు చేపట్టాలని ఆయన కోరారు. రాష్ట్ర కార్యదర్శి దివాకర్, జిల్లా అధ్యక్షుడు నరసింహులు,కార్యదర్శి రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లును కూల్చారంటూ ఫిర్యాదు

పెద్దమండ్యం, మార్చి 3: మండలంలోని కొత్త ఈ డిగపల్లి లో కాపురం ఉంటున్న తన ఇల్లును ఎక్స్ కవేటర్‌తో కూల్చేశారని బాధితుడు చిన్న సిద్దప్ప పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇల్లు తమ స్థలంలో ఉందని సమీప గ్రామస్థులు కొందరు దౌర్జన్యంగా ఆదివారం ఇల్లు ను కూల్చే శారని బాధితుడు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్

మదనపల్లె టౌన్, మార్చి 3: ఆరాచక వైసీపీ పాలన నుం చి రాష్ట్ర భవిష్యత్ కాపా డాలంటేటీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సీఎం కావాలని మదనపల్లె టీడీపీ నేత మాజీ ఎమ్మెల్యే షాజ హాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివా రం పట్టణ బైపాస్‌రోడ్డులోని ఓంశక్తి ఆలయంలో నిర్వహిం చిన సుదర్శన హోమంలో షాజహాన్‌బాషా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చంద్రబాబు సీఎం కావాలని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన పొత్తుతో తుఫాను గాలికి ఫ్యాన్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు.ఈ కార్యక్రమంలో ఓంశక్తి భక్తులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, మార్చి 3: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును తెలు గు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు కలిశారు. ఆదివారం దాచేప ల్లె పర్యటనలో వున్న చంద్రబాబును కలసిన చినబాబు తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. మదనపల్లెలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని పెద్ద మెజారిటితో గెలిపించుకుని వస్తామని చంద్రబాబుతో చెప్పారు. ఈ కార్యక్రమంలో చినబాబు సోదరుడు యోగేష్‌బాబు పాల్గొన్నారు.

దళితులపై ప్రేమంటే .. వారిపైన దాడులు చేయడమా..?

●జనసేన నేత రామ్‌దాస్‌చౌదరి ప్రశ్న

మదనపల్లె, మార్చి 3: నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనా ర్టీలని మాటల్లో వల్లమాలిన ప్రేమ చూపించే సీఎం జగన్..వారిని చంపడమేనా ప్రేమంటే? అంటూ జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం మీడియా మాట్లాడుతూ పల్నాడు జిల్లా రెంటచింతల గ్రామంలో ఎస్టీ మహిళ సామినిబాయి..నీళ్లు తాగడానికి ట్యాంకు దగ్గరకు వెళ్తే..తెలుగుదేశం సానుభూతి పరురాలు అనే కక్షతో ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశాడన్నారు. ఈఘటనలో అనుమానా స్పద కేసు నమోదు చేయకుండా ప్రమాదంగా నమోదు చేసి, కేసు క్లోజ్ చేసే ప్రయత్నం చేశారని రామ్‌దాస్‌చౌదరి ఆరోపించారు. సమా వేశంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, జిల్లా జాయింట్ సెక్రటరీలు సనా ఉల్లా, గజ్జల రెడ్డెప్ప, రూరల్ అధ్యక్షుడు గ్రానైట్ బా బు, చంద్రశేఖర్, పురం నగేష్, లక్ష్మీనారాయణ, లవన్న, నాగవేణి, మో హన్‌కృష్ణ, జంగాల గౌతమ్, రెడ్డిశేఖర్‌రెడ్డి, నరేష్, జయ పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, మార్చి 3:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం సంతానలక్ష్మికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధికంగా వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

బీసీ సభకు తరలిరండి

కురబలకోట, మార్చి 3: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న జయహో బీసీ సభకు తరలిరావాలని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 5న గుంటూరు సమీపంలోని నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా బీసీ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో లో నిర్వహించే సభకు చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పాల్గొంటారన్నారు. ఈ సభలో బీసీల అభ్యున్నతి కోసం డిక్లరేషన్ ప్రకటించనున్నారన్నారు. ఈ పర్యటన విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జిల్లా నుంచి ఈ సభకు బీసీ యువత, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు తరలిరావాలని కోరారు.



కన్నప్ప ఆలయం వద్ద ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు





కొండపైకి భక్తకన్నప్ప ఊరేగింపు



శిఖర గాలి గోపురం వద్ద అలంకరణ



ముక్కంటీశుడి ధ్వజస్తంభం వద్ద పుష్పాలంకరణ

భక్తుడికే తొలి పూజ

- శ్రీకాళహస్తిలో ఆగమోక్తంగా 'భక్త కన్నప్ప' ధ్వజారోహణం
- ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

శ్రీకాళహస్తి, మార్చి 3: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం భక్త కన్నప్ప ఆలయం ధ్వజారోహణంతో శ్రీకారం చుట్టారు. భక్తుడికి కొండపై స్థానం కల్పించి.. తొలి పూజను కూడా అతడికే జరిగేలా వాయులింగేశ్వర స్వామి వరమిచ్చిన కారణంతో కన్నప్ప ఆలయ ధ్వజారోహణ ఆగమోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ముక్కంటి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. కన్నప్ప ఉత్సవమూర్తిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. అభిషేక పూజలు చేశాక మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ కన్నప్ప కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కన్నప్ప ఆలయం ఎదుట ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. ధ్వజస్తంభానికి పూజలు చేసి, హారతులు పట్టారు. అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. తర్వాత కన్నప్ప ఉత్సవమూర్తిని ముక్కంటి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. సన్నిధి వీధిలో బోయ కులస్థుల ఏర్పాటు చేసిన విడిది మండపంలో కొలువుదీర్చారు. సంప్రదాయం ప్రకారం ఉభయదారులైన బోయలు వస్త్రం, నైవేద్యం సమర్పించాక గ్రామోత్సవం ప్రారంభమైంది. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఈవో నాగేశ్వరరావు, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈవోలు ధనపాల్, ఇన్‌స్పెక్టర్ హరిబాబుయాదవ్, పర్యవేక్షకులు విజయసారథి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా దూర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలను ఆదివారం ప్రారంభించారు. శ్రీకాళహస్తి క్షేత్రం విద్యుత్, పుష్పాలంకరణలతో ఆకట్టుకుంటోంది.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 9గంటలకు వెండి అంబారి సేవ
- మధ్యాహ్నం 12 గంటల నుంచి ముక్కంటి ధ్వజారోహణం ప్రారంభం
- రాత్రి 8గంటలకు వెండి అంబారి సేవ

ఏకాంతంగా ఆర్జిత సేవలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు జరిగే ఆర్జిత సేవలన్నీ ఏకాంతంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలు పూర్తయ్యేవరకు ప్రభాతసేవ, నిత్యోత్సవం, నిత్యకల్యాణం, చండీ, రుద్రహోమాలు, శయనోత్సవ సేవలను రద్దు చేశారు. రాహు, కేతు సర్ప దోష నివారణ పూజలకు మహాశివరాత్రి రోజున మాత్రమే విరామం ఇవ్వడం ఆనవాయితీ. మిగిలిన రోజుల్లో యథావిధిగా సాగనున్నాయి.

నేడు కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం

చిత్తూరు, మార్చి 3: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి కలెక్టర్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరిస్తారన్నారు.


● ఎస్పీ కార్యాలయంలో.... జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ జాషువా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు.

తవ్వే కొద్దీ తప్పులే

- ఆందోళనలో ఓటర్లు



మృతిచెందిన కాంతమ్మ, క్రిష్ణయ్య ఓటర్లే



అత్తారింటికి వెళ్లిన గునాకు కొనసాగుతున్న ఓటు

పెనుమూరు, మార్చి 3: తప్పుల్లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని గతంలో ఉన్నతాధికారులు పదేపదే ఆదేశించినా తుది జాబితా ఇందుకు భిన్నంగా ఉంది. అధికారులు ఆదేశించినా తప్పులు దొర్లుతూనే ఉన్నాయి. తుది జాబితాలను పరిశీలిస్తే తప్పులు కుప్పలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. పెనుమూరు మండలంలోని 40వ బూత్ లో వరుస సంఖ్య 168లో కాంతమ్మకు ఓటు ఉంది. అయితే ఈమె మరణించి చాలా కాలం అవుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. వసంతమ్మ కూడా చాలాకాలం కిందటే మృతిచెందినా వరుస సంఖ్య 355లో ఓటు హక్కు ఉంది. మృతుడు క్రిష్ణయ్య కూడా ఇక్కడ ఓటరే. అలాగే బి.ప్రీతి, పి.గునాకు పెళ్లై బయటి ప్రాంతాలకు వెళ్లిపోయినా తుది జాబితాలో వారికి ఓటు హక్కు కల్పించడం గమనార్హం.

● అలాగే, పెనుమూరు మండలంలోని బూత్ నెంబరు 9లో వరుస సంఖ్య 530లో దేవళ్ల రాజయ్యకు ఓటు హక్కు కల్పించారు. ఈయన మరణించి చాలా సంవత్సరాలు అవుతుంది. ఇదే బూత్‌లో వరుస సంఖ్య 671లో ఈశ్వరయ్యవీ అనే వ్యక్తికి ఓటుంది. ఆయన కూడా చనిపోయి చాలా సంవత్సరాలు అవుతుందని గ్రామస్తులు తెలిపారు.

భవిష్యత్తులో అమరలో

ప్రపంచస్థాయి వైద్యసేవలు

గల్లా రామచంద్రనాయుడు



గల్లా దంపతులను సన్మానిస్తున్న డాక్టర్లు రమాదేవి, ప్రసాద్

రేణిగుంట, మార్చి 3: భవిష్యత్తులో అమర ఆస్పత్రిలో ప్రపంచస్థాయి వైద్యసేవలు అందిస్తామని అమరరాజా సంస్థల అధినేత గల్లా రామచంద్ర నాయుడు వెల్లడించారు. ఆదివారం రేణిగుంట - కడప మార్గంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమర ఆస్పత్రి మూడో వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సొంత జిల్లాలో పరిశ్రమలు అభివృద్ధి చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని భావించామన్నారు. అందుకే తాము అమరరాజ సంస్థలను ఇక్కడే నెలకొల్పామన్నారు. నేడు ప్రపంచస్థాయిలో అన్నిదేశాలకు తమ సంస్థ ఉత్పత్తులు పంపుతున్నామని చెప్పారు. అమర ఆస్పత్రి ఏర్పాటు చేసే సమయంలోనూ విశాఖపట్టణం, హైదరాబాదు నగరాల్లో ఆస్పత్రి ఏర్పాటు చేయాలని తమ కుటుంబంలో చర్చలు జరిగాయని వివరించారు. అయితే తిరుపతి సమీపంలో ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తే బాగుంటుందని సలహా ఇచ్చానన్నారు. తన ఆలోచనను అనుసరిస్తూ మూడేళ్ల క్రితం ఇక్కడ అమర ఆస్పత్రిని ప్రారంభించామన్నారు. అనతికాలంలోనే కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందించడం అభినందనీయమన్నారు. మరో పదేళ్లలో ప్రపంచదేశాలలో లభించే వైద్యసేవలు లభించే అవకాశం ఉందన్నారు. మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి మాట్లాడుతూ పరిశ్రమలతో పాటు వైద్యరంగంలోనూ తమపిల్లలు ఏర్పాటు చేసిన ఆస్పత్రి సేవలు ఖండాంతరాల్లో పేరు గడించేలా డాక్టర్లు ప్రసాద్, రమాదేవి కృషి చేయడం అభినందనీయన్నారు. మాతృభూమికి సేవ చేసేందుకే అమెరికా నుంచి ఇక్కడికి వచ్చామని డాక్టర్ గౌరినేని ప్రసాద్ తెలియజేశారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల స్వైరవిహారం



పాకాల, మార్చి 3: పాకాల, ఐరాల మండలాల పరిధిలో పదిపుట్లబైలు, కాకర్లవారిపల్లె, చుక్కావారిపల్లె, గూబలవారిపల్లె సమీపంలోని పంట పొలాలపై శనివారం రాత్రి ఏనుగుల గుంపు స్వైరవిహారం చేసింది. పదిపుట్లబైలు, కాకర్లవారిపల్లె సమీపంలోని శిలగొందిమూల అటవీ ప్రాంత వద్ద మామిడితోటలు, కూరగాయల పంటలను ధ్వంసం చేశాయి. చుక్కావారిపల్లె, గూబలవారిపల్లె పరిసరాల్లోని వరిపొలాలను తొక్కి తీవ్ర నష్టం కలిగించాయి. ఏనుగుల గుంపు సదుం మండల సరిహద్దు గుండాల కనుమ అటవీ ప్రాంతంలో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మళ్లీ తిరిగి పాకాల మండల పరిసరాల్లో పంటలపై ఏనుగుల గుంపు దాడి చేస్తుందని రైతులు భయపడుతున్నారు.

- సుప్రీంకోర్టు దయతో..

పుంగనూరులో మైకులో మాట్లాడుతున్నా

- ఐదేళ్లలో పెద్దిరెడ్డి రూ.35వేల కోట్ల దోపిడీ
- ధర్మపోరాట సభలో బీసీవై అధినేత రామచంద్రయాదవ్





సభలో ప్రసంగిస్తున్న బీసీవైపీ అధినేత రామచంద్రయాదవ్ - సభకు వచ్చిన వాహనాలు తనిఖీలు చేస్తూ వీడియో తీస్తున్న పోలీసులు

పుంగనూరు, మార్చి 3: 'పుంగనూరులో సభ నిర్వహించేందుకు రెండున్నరేళ్లుగా పోరాడుతున్నా. స్థానిక అధికారుల నుంచి హైకోర్టు వరకూ వెళ్లినా అనుమతి రాలేదు. చివరకు సుప్రీంకోర్టు దయవల్ల ఇప్పుడు మైకు పట్టుకుని మాట్లాడే అవకాశం వచ్చింది' అని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం పుంగనూరు మండలం చదళ్ల-కాటిపేరి రోడ్డులోని ఆయన మామిడి తోటలో జరిగిన బీసీవైపీ ధర్మపోరాటసభలో ప్రసంగించారు. పక్క నియోజకవర్గం నుంచి వలస వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వల్ల 15ఏళ్లుగా పుంగనూరులో రౌడీయిజం, అరాచకాలు, దోపిడీ, దౌర్జన్యాలు, పాలు, మైన్స్, భూముల కబ్జా, అక్రమాలు పెరిగిపోయాయని ప్రజలు గమనించాలన్నారు. ఫ్యాక్టరీల పేరుతో రైతుల వద్ద భూములను లాక్కున్న పెద్దిరెడ్డి.. ఒక్క ఫ్యాక్టరీని ఏర్పాటు చేయలేదన్నారు. గత ఎన్నికల్లో పెద్దిరెడ్డికి 1.07లక్షల మంది ఓట్లు వేయగా.. ఆ అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.35 వేల కోట్లు దోపిడీ చేశారన్నారు. చాలా మంది యువతను డ్రగ్స్ గంజాయి, మత్తుపదార్థాలకు బానిసలుగా తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దిరెడ్డి దౌర్జన్యాలను తరిమి కొట్టడమే ప్రధాన అజెండాగా రానున్న ఎన్నికల్లో తాను పుంగనూరు నుంచి పోటీ చేస్తున్నానని ప్రకటించారు. ఇక్కడ మార్పు కోసం ఇతర పార్టీలూ సహకరించాలని కోరారు.

ప్రతిరైతుకు ఉచితంగా ఆవు ఇస్తా

తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి రైతు ఇంటికి ఉచితంగా పాడిఆవు ఇస్తానని రామచంద్రయాదవ్ హామీ ఇచ్చారు. ప్రతి మండలానికి ఒక డెయిరీ, చక్కెర పరిశ్రమను తిరిగి ప్రారంభిస్తానన్నారు. పతంజలి లాంటి పరిశ్రమ ఏర్పాటు చేయించి దాదాపు 5వేల మందికి ఉపాధి కల్పిస్తానని చెప్పారు. టమోటా, చింతపండు, మామిడి పంటల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పులిచెర్ల- కేజీఎఫ్ రైల్వేలైన్ కేంద్రంతో పోరాడి తీసుకొస్తానని చెప్పారు. కాగా, పోలీసులు సభకు వెళ్లే రోడ్లు, సభకు వస్తున్న వాహనాలు, జనాలు వీడియోలు తీయడం, వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆర్.హరినాథరెడ్డి, బీసీవై పార్టీ నాయకులు సాంబమూర్తి, ఆనంద్, హరియాదవ్, పాలరమేశ్, సుబ్రహ్మణ్యంరెడ్డి, కిరణ్, శివకుమార్, నూర్, బక్షూ, విశ్వనాథరెడ్డి, సురేంద్ర, కేశవరెడ్డి, నారాయణస్వామి, వెంకటేశ్, శేషాద్రి, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణవేణి, అధిక సంఖ్యలో బీసీవైపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సహకరించరనే..!

- 20 రోజులకే ఎస్పీ బదిలీ వెనుక కారణమిదేనన్న ప్రచారం

తిరుపతి జిల్లాగా ఏర్పడ్డాక నియమితులైన తొలి మహిళా ఎస్పీ.. మలికా గర్గ్. ఈమె గతనెల 12వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. సరిగ్గా 20 రోజుల్లోనే బదిలీ అయ్యారు. ఎన్నికల్లో తమకు సహకరించరని అధికార పార్టీ నేతలు నిర్ధారణకు రావడం వల్లే ఈ బదిలీ అన్న ప్రచారం జరుగుతోంది. - ఆంధ్రజ్యోతి, తిరుపతి

జిల్లాకు ఏ అధికారి వచ్చినా అధికార పార్టీ నేతలను కలిసి శాలువాలు కప్పడం.. పుష్పగుచ్ఛాలు ఇవ్వడం పరిపాటిగా మారింది. అయితే ఎస్పీగా వచ్చిన మలికా గర్గ్ ఇటువంటివేమీ చేయలేదు. దీన్ని అధికార పార్టీలో పలువురు ముఖ్య నేతలు జీర్ణించుకోలేకపోయారని తెలిసింది. బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల్లోనే అవినీతి, విధి నిర్వహణలో అలసత్వం వంటి ఆరోపణలతో ఓ హెడ్ కానిస్టేబుల్, ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. వారిలో ఒకరిపై చర్యలు వెనక్కు తీసుకోవాలని అధికార పార్టీ కీలక నేత ఒకరు చెప్పినా ఎస్పీ వినిపించుకోలేదని పోలీసు వర్గాల సమాచారం. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై అకారణంగా రౌడీషీట్ తెరుస్తున్నారని ఆ పార్టీ నేతలు ఎస్పీని కలసి ఆందోళన వ్యక్తం చేయడంతో వారిని సమాధానపరిచి విచారణకు ఉపక్రమించారు. మరోవైపు జిల్లావ్యాప్తంగా గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వారిని గుర్తించి బైండోవర్ చేయాలని, మూడుకు మించి కేసుల్లో నిందితులుగా ఉన్నవారిపై రౌడీ షీట్లు తెరవాలని కింది స్థాయి అధికారులను ఆదేశించారు. ఆ క్రమంలో అధికార పార్టీకి చెందిన వారిపైనే ఎక్కువగా రౌడీషీట్లు తెరిచారని తెలుస్తోంది. ఈ పరిణామాలు అధికార పార్టీ నేతలకు మింగుడుపడలేదు.

కొండపై నుంచీ చక్రం తిప్పిన అధికారికీ చుక్కలు చూపిన వైనం

ప్రత్యేకించి గతంలో తిరుమల కొండపై నుంచీ జిల్లా అంతటా చక్రం తిప్పిన ఓ పోలీసు అధికారి ఎన్నికల నేపథ్యంలో దిగువకు బదిలీ అయ్యారు. సీఎంకు సన్నిహితుడిగా పేరుపడ్డ ఆ అధికారికి బందోబస్తు డ్యూటీలు వేసే సాహసం ఏ అధికారీ చేయలేదు. అయితే మలికా గర్గ్ అలాంటి మినహాయింపులేమీ ఇవ్వకుండా బందోబస్తు డ్యూటీ చేయించారని సమాచారం. ఆమే ఎస్పీగా కొనసాగితే తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఎపిక్ కార్డుల కేసుల దర్యాప్తులో కూడా ఇబ్బందులు తప్పవని అధికార పార్టీ నేతలు, అందులో పాలుపంచుకున్న పోలీసు అధికారులు ఆందోళనకు గురైనట్టు ఆయా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ కారణాలకుతోడు ఎస్పీ తీరు గమనిస్తే వచ్చే ఎన్నికల్లో సహకరించే పరిస్థితి లేదని గ్రహించడంతోనే అధికార పార్టీ కీలక నేతలు సీఎంవోలో ఒత్తిడి తెచ్చి ఆమెను బదిలీ చేయించినట్టు రాజకీయ, పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. నిక్కచ్చిగా, నిజాయితీగా పనిచేస్తారని గుర్తింపు తెచ్చుకుంటున్న మహిళా పోలీసు అధికారిని కేవలం 20 రోజుల్లోనే అది కూడా ఎన్నికల సమయంలో బదిలీ చేయడం పట్ల అన్నివర్గాల నుంచీ విమర్శలు వస్తున్నాయి.



మలికా గర్గ్

తిరుపతి నూతన ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్

- మలికా గర్గ్‌ను సీఐడీ ఎస్పీగా బదిలీ చేసిన ప్రభుత్వం



తిరుపతి(నేరవిభాగం), మార్చి 3: జిల్లాకు నూతన ఎస్పీగా విజయవాడ శాంతి భద్రతల విభాగం డీసీపీగా పనిచేస్తున్న కృష్ణకాంత్ పటేల్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్పీగా పనిచేస్తున్న మలికా గర్గ్‌ను సీఐడీ ఎస్పీగా ఆదివారం ప్రభుత్వం బదిలీ చేసింది. 2018 బ్యాచ్‌కు చెందిన కృష్ణకాంత్ పటేల్‌ను శిక్షణ అనంతరం చింతూరు గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా నియమించారు. తర్వాత రంపచోడవరం ఏఎస్పీగా, అనంతరం కర్నూలు సెబ్ ఏఎస్పీగా పనిచేశారు.

ఎన్నికల విధులపై తొలిరోజు నుంచే ఖరాఖండీ ఆదేశాలు

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజు నుంచే వచ్చే ఎన్నికల్లో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని, పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చూడడం ప్రథమ కర్తవ్యంగా భావించాలని కింది స్థాయి అధికారులకు ఖరాఖండీగా చెబుతున్నారు. సమీక్షల్లోనూ, పోలీసు స్టేషన్లు తనిఖీ చేసిన సందర్భాల్లోనూ అధికారులకు ఇవే చెబుతూ వచ్చారు. ముఖ్యంగా గతంలో తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో జిల్లాకు చెడ్డపేరు వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో అలాంటివి పునరావృతం కారాదని తేల్చి చెప్పారు. ఎవరైనా గీత దాటితే నిర్మొహమాటంగా చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులకు కూడా నివేదిస్తామని కఠినంగా మాట్లాడుతూ వచ్చారు. ఆ క్రమంలో విధుల పట్ల అలక్ష్యంగా, ఏకపక్షంగా వ్యవహరించే కొందరు అధికారులకు చుక్కలు చూపించినట్టు ప్రచారంలో ఉంది.

'వీరప్పన్' స్థూపం ఆవిష్కరించిన ఎమ్మెల్సీ



శాంతిపురం, మార్చి 3: శాంతిపురం మండలం కాకర్లవంకలో ఆదివారం గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ స్థూపాన్ని ఎమ్మెల్సీ భరత్ ఆవిష్కరించారు. వీరప్పన్ చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వన్నెకుల క్షత్రియుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మండల వైసీపీ కన్వీనర్ దండపాణి మాట్లాడుతూ.. తమకు, తమ కులానికి వీరప్పన్ ఆరాధ్య దైవమన్నారు. ప్రభుత్వం దృష్టిలో అతను తప్పుచేసిన వ్యక్తిగా ముద్రపడినా, ప్రజల దృష్టిలో మాత్రం దేవుడయ్యాడన్నారు.